చమురు సంస్థల కార్యకలాపాలతో అపార నష్టం



» అసెంబ్లీలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పి.గన్నవరంతోపాటు రాజోలు, అమలాపురం నియోజకవర్గాల్లో చమురు సంస్థల వల్ల అపారనష్టం వాటిల్లుతోందని శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ స్పీకర్ దృష్టికి తెచ్చారు. ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు నిర్వహిస్తున్న డ్రిల్లింగ్ కార్యకలాపాలవల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, వారి వాహనాలవల్ల వెంతనలు, రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు. 2014లో నగరం గ్యాస్ పైపులైను విస్ఫోటనంలో 22మంది చనిపోయారని, ఆ సమయంలో గెయిల్ సంస్థ పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందించలేదని గుర్తుచేశారు.గ్రామాన్ని దత్తతగ్రామంగా తీసుకుంటానని హామీఇచ్చి గాలికొదిలేశారన్నారు. చమురుసంస్థల కార్యకలాపాలు నిర్వహిస్తున్నగ్రామాల్లో అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలన్నారు.

ఓఎన్జీసీ, గెయిల్‌లతో నష్టాలు



» అసెంబ్లీలో రాజోలు ఎమ్మెల్యే దేవ

మలికిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజోలులో ఓఎన్జీసీ, గెయిల్ వంటి చమురు సంస్థలఆపరేషన్‌లవల్ల తీరప్రాంతాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన శాసనసభలో మాట్లాడారు. చమురు సంస్థలు నిర్వహించే డ్రిల్లింగ్, పైపులైన్లు, ఇతర కార్యకలాపాలవల్ల రోడ్లు, వంతెనలు పాడైపోయాయన్నారు. 60గ్రామాల్లో మంచినీరు లేదని, పంటలు, కొబ్బరిచెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, భూగర్భజలాలు కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెయ్యి మంది డయాలసిస్‌రోగులు రాజోలులో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చమురు సంస్థలకు కచ్చితమైన పాలసీ తీసుకువచ్చి నియమాలు అనుసరించేలా చేయాలని, తద్వారా ఈ అరాచకాలకు అడ్డుకట్ట పడుతుందని అన్నారు. ఈ మధ్య భూమి కుంగిందనే వాదన ఉందని, మురుగు డ్రెయిన్లనీరు సముద్రంలో పూర్తిస్థాయిలో కలవడం లేదని అన్నారు.



అమలాపురంలోని శ్రీవాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.4.50 కోట్ల కరెన్సీ నోట్లతో అలంకరించిన దృశ్యం

రూ.4.50కోట్ల కరెన్సీ నోట్లతో..


అమ్మవారి అలంకరణ

అమలాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లను శుక్రవారం కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిదేవి రూపంలో అలంకరించారు. అమలాపురం పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో రూ.4కోట్ల50లక్షల కొత్త కరెన్సీనోట్లతో వాసవీమాతను అలంకరించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము ఈ అలంకరణ ఉంచారు. నోట్లతో దండలను గుచ్చి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో చేసిన అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, కన్యకాపరమేశ్వరి ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు అనేకమంది ఉద్యోగ, వ్యాపారస్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి అలంకరణ చూసేందుకు క్యూకట్టారు. ముందు జాగ్రత్తగా పోలీసుల భద్రత ఏర్పాటు చేశారు.



అభివృద్ధికి.. జల..బాట!

అసెంబ్లీలో జలరవాణాపై చంద్రబాబు కీలక ప్రసంగం



జల రవాణాపై ఇదీ లెక్క..

ఉమ్మడి జిల్లాలో కాకినాడ నుంచి ఏలూరు కాలువ వరకు ఇన్‌లాండ్ వాటర్ కింద నదీ మార్గాల్లో కార్గో తరలింపుపైనా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. గోదావరి నది ద్వారా కృష్ణాకు, కాకినాడ-ఏలూరు కాలువ, కాకినాడ-బకింగ్‌హాం కెనాల్ నుంచి చెన్నైకు, గోదావరి ద్వారా మహారాష్ట్రకు జల రవాణాకు ఎంతో ఆస్కారం ఉందని వివరించారు. నదులపై కాలువ మార్గాల ద్వారా అనేక పరిశ్రమలకు కార్గో ఏవిధంగా తరలించవచ్చనే దానిపై ఇప్పటికే టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ మార్గాలను అభివృద్ధి చేయడానికి కొందరు ముందుకు వస్తున్నారన్నారు. రవాణా రంగం ఖర్చుల విషయానికి వస్తే టన్ను కార్గో రవాణా ఖర్చుకు రోడ్డు మార్గం ద్వారా రూ.3.78 అవు తుంటే.. సముద్రమార్గం రవాణాకు రూ.1.80, నదీ జలరవాణాకు రూ.3.30 అవుతుందన్నారు.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఓడరేవులు, నదీ జల రవాణాతో పారిశ్రామికంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అద్భుత భవిష్యత్తు లభించబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అత్యంత చవకైన కార్గో రవాణా ద్వారా పారిశ్రామిక అభివృద్ధి పెద్ద ఎత్తున జరగనుందని వివరించారు. ఈ మేరకు అసెంబ్లీలో సీఎం శుక్రవారం పారిశ్రామిక, ఓడరేవు, లాజిస్టిక్ రంగాల్లో కొనసాగుతున్న పెట్టుబడులు, భవిష్యత్ ప్రాజెక్టులను కూలంకషంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విశ్లేషించారు. తీరప్రాంతాన్ని గుజరాత్ తర్వాత దేశంలో ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగించుకుంటోందన్నారు.

సీఎం ఏమన్నారంటే..

కాకినాడ గేట్‌వే పోర్టు(కేజీపీఎల్) రూ.2,621 కోట్లతో చేపట్టిన కొత్త పోర్టు నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తవుతుందన్నారు. ఈ కొత్త పోర్టు అందుబాటులోకి వస్తే ఏటా 16 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ జరుగుతుందన్నారు. ప్రస్తుతం పోర్టులో మూడు బెర్తుల నిర్మాణం జరుగుతోంది. ఒకటి బొగ్గు దిగుమతికి, మరో రెండు బెర్తులు అన్ని రకాల కార్గో ఎగుమతి,దిగుమతులకు వినియోగిస్తున్నారన్నారు. వచ్చే ఏడాది డిసెంబరుకు ఇది అందుబాటులోకి వస్తే మౌలిక వసతులు, పారిశ్రామికంగా ఆ ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని సీఎం వివరించారు. ఇదికాకుండా ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్న కాకినాడ సీపోర్టు ద్వారా ఏటా 26 మిలియన్ మెట్రిక్ టన్నులు, కాకినాడ యాంకరేజ్ పోర్టు ద్వారా 4 మిలియన్ మెట్రిక్ టన్నులు, కోన సీమ లోని రవ్వ పోర్టు ద్వారా 2 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడిచమురు కార్గో కార్యకలాపాల ద్వారా జరుగుతున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ పోర్టుల ద్వారా వ్యాపారం పెరుగుతుందన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం..

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో గోదావరి కాలువలపై సరుకు రవాణా, పర్యాటక యాత్రలకు పది రూట్లను ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఎంపిక చేసి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నేషనల్ వాటర్‌వే-4 ద్వారా కాకినాడ కెనాల్, గోదావరి మీదుగా సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్లకు ముడిసరుకు సరఫరాకు ప్రణాళికలు తయారు చేసింది. ఈ మేరకు కాకినాడ- రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం- విజయవాడ కెనాల్, రాజమహేంద్రవరం- భద్రాచలం, పురుషోత్తపట్నం-భద్రాచలం గోదావరి మార్గం, పురుషోత్తపట్నం-పోలవరం,నర్సాపూర్ వెస్ట్- అంతర్వేది- సఖినేటిపల్లి, కోటిపల్లి-ముక్తేశ్వరం మార్గాలను ఎంపిక చేసింది. విమానయాన రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ కూడా చేపట్టామని సీఎం వివరించారు.

ఓఎన్జీసీ, గెయిల్‌పై వాడివేడిగా..

ఉమ్మడి జిల్లాలో చమురు, గ్యాస్ కార్య కలాపాలు నిర్వహిస్తోన్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థల తీరుపై అసెంబ్లీలో కోనసీమ జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఓఎన్జీసీ, గెయిల్ గ్యాస్, చమురు పైపులైన్ల కారణంగా గోదావరి తీర ప్రాంతం దెబ్బతిందని, ప్రధానంగా కోనసీమ జిల్లాలో భూగర్భ జలాలు పాడైపోయాయని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కంపెనీలు కనీసం సీఎస్సార్ అమలులోను బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ సంస్థల వల్ల అనేక చోట్ల భూమి కుంగిపోయి డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని వివరించారు. దీనిపై శాస్త్రీయ అధ్యయనం జరగాలని డిమాండ్ చేశారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ఈ రెండు సంస్థలు ఏర్పాటయ్యే సమయంలో స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఆ తర్వాత మోసగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిద్దరి ప్రశ్నలకు మంత్రి బీసీ జనార్దనరెడ్డి అసెంబ్లీలో సమా ధానం ఇచ్చారు. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై త్వరలో అధికారుల ద్వారా నివేదిక రప్పి స్తామని, తదనుగుణంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భూమి కుంగిపోవడం, సముద్రంలోకి వెళ్లకుండా మురుగునీటి డ్రైన్లు పొంగుతున్నాయన్న సమస్యపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎస్సార్ నిధులు ఖర్చు చేయడం లేదనే విషయంపై నివేదికలు రప్పిస్తామని తెలిపారు.

» ఓడరేవు, లాజిస్టిక్ అభివృద్ధి
» రూ.2,621 కోట్లతో గేట్‌వే పోర్టు
» వచ్చే ఏడాది డిసెంబర్‌కు పూర్తి
» జలరవాణాకు కసరత్తు
» విమానాశ్రయ రన్‌వే విస్తరణ
» ఓఎన్జీసీ, గెయిల్ విధ్వంసంపై చర్చ
» ఉమ్మడి జిల్లాకు అద్భుత భవిష్యత్తు

నేటినుంచి వర్షాలు



» వాయుగుండం ప్రభావంతో భారీగా కురిసే అవకాశం
» టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్

అమలాపురం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): శనివారంనుంచి భారీవర్షాలు పడే అవకాశం ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడనున్న దృష్ట్యా జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ఈ మేరకు జిల్లాస్థాయి అధికారులతో శుక్రవారం టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాలో అక్కడక్కడా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్ననేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మండల డివిజన్, జిల్లా కేంద్రాల్లో 24గంటలు పనిచేసేలా కంట్రోల్ రూములు ఏర్పాటుచేసి సిబ్బందిని నియమించాలని రెవెన్యూఅధికారులను కలెక్టర్ ఆదేశించారు.వర్షాల ముంపు కారణంగా ఎక్కడ ఏ ఇబ్బందులున్నా కంట్రోల్ రూముకు ఫోన్ చేసి సహాయం కోరవచ్చునన్నారు. మరోవైపు గోదావరి పరివాహక ప్రాంతాల్లో వరద ఉధృతి కారణంగా ఈనెల 28వతేదీ నాటికి ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంటుందని, దీనిదృష్ట్యా కోనసీమలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తతో ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

మొదలైన వర్షాలు

జిల్లాలో వాయుగుండం ప్రభావంతో శుక్రవారం సాయంత్రంనుంచి జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు వర్షపు జల్లులు ప్రారంభమయ్యాయి. రానున్న రెండురోజుల్లో భారీవర్షాలు కురుస్తాయన్న అధికారుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు సైతం అప్రమత్తమయ్యారు. శుక్రవారం ఈదురు, చలిగాలులు ఇబ్బందులకు గురిచేశాయి. సాయంత్రంనుంచి వాతావరణం పూర్తిగా మేఘావృతమై స్వల్పంగా జల్లులు ప్రారంభమయ్యాయి. జిల్లాలో 26వతేదీ ఉదయానికి కపిలేశ్వరపురంలో 15.2 మిల్లీమీటర్ల వర్షపాతం అత్యధికంగా నమోదైంది. ఆత్రేయపురంలో 4.8, మండపేటలో 1.0, రాయవరం లో 1.8, ఆలమూరులో 1.2, రావులపాలెంలో 11.8, కొత్తపేట, ఐ.పోలవరం, సఖినేటిపల్లిల్లో 2.2, ముమ్మిడివరంలో 5.6, అంబాజీపేటలో 1.8, అమలాపురంలో 4.0, ఉప్పలగుప్తంలో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో సగటున 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

చెడీతాలింఖానా ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

» రెవెన్యూ, పోలీసు, దేవదాయశాఖ అధికారులతో సమీక్ష
» కలెక్టర్ మహేష్, ఎస్పీ రాహుల్



కలెక్టరేట్‌లో చెడీతాలింఖానా ఉత్సవాలపై వివిధశాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

అమలాపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినం సందర్భంగా అమలాపురం పట్టణంలో జరిగే చెడీ తాలింఖానా ఉత్సవాలను అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అక్టోబరు 2న జరిగే చెడీ తాలింఖానా నేపథ్యంలో కలెక్టరేట్‌లో పోలీసు, రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్పీ రాహుల్‌మీనా, జేసీ నిషాంతితోపాటు వివిధశాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ఏడు వీధుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో విద్యుత్‌లైన్లు, కేబుల్‌వైర్లు సరి చేసి ఊరేగింపు నిర్వహణకు ఆటంకాలు లేకుండా చూడాలని విద్యుత్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఊరేగింపులు ఆయా వీధుల నుంచి నిర్దీత సమయాల్లో బయలుదేరేలా చూడడంతో పాటు అనుమతించిన ప్రాంతాల్లో మాత్రమే బాణసంచా కాల్చాలని సూచించారు. వీధుల్లో జరిగే ఊరేగింపుల రూట్‌మ్యాప్, ట్రాఫిక్ మళ్లింపులపై పోలీసులు దృష్టిపెట్టాలని ముఖ్యంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ఒక్కొక్క ఒక్కో డ్రోన్ కెమెరా, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గడియారస్తంభం సెంటర్‌లో ఏర్పాటు చేసే కంట్రోల్ రూముకు అనుసంధానం చేసి నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్‌లను ఊరేగింపుల్లో లేకుండా చూడాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. బోడసకుర్రులో నిర్వహించే ఉత్సవాలు, అంబాజీపేటలో అక్టోబరు 8న నిర్వహించే విజయబేతాళస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణ వ్యవస్థలను పటిష్టంగా ఏర్పాటుచేయాలని, నిమజ్జనాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే చెడీతాలింఖానా ఉత్సవాల నిర్వహణ సున్నితమైన అంశమని, సూక్ష్మస్థాయిలో బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ తెలిపారు. జేసీ నిషాంతి, డీఆర్వో మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, డీపీవో శాంతలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ రంగారావు, నిర్మల్‌కుమార్, డీఎస్పీలు ప్రసాద్, ఎస్.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు విముక్తి

» శ్రీలంక జైలు నుంచి మత్స్యకారుల విడుదల 7
» 52 రోజుల తర్వాత కాకినాడకు రానున్న జాలర్లు

కపిలేశ్వరపురంలో చోరీ 7

» బంగారం, వెండి అపహరణ

వాడపల్లి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించండి



బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నిషాంతి

» క్యూలైన్లు, ప్రత్యేక దర్శనాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి
» షవర్‌బాత్‌లు ఏర్పాటు చేయండి
» సమీక్షలో జేసీ నిషాంతి

అమలాపురం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను అక్టోబరు 10వతేదీ నుంచి 18 వరకు ప్రశాంత వాతవరణంలో నిర్వహించాలని జేసీ టి.నిషాంతి సూచించారు. అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో శుక్రవారం సమావేశమయ్యారు. స్వామివారి బ్రహ్మోత్సవాల నిర్వహణ, భద్రతా సమావేశాల్లో దిశానిర్దేశం చేశారు.జేసీ నిశాంతి మాట్లాడుతూ 9రోజులపాటు జరిగేస్వామి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. రోజువారీగా భక్తులు హాజరయ్యేసంఖ్యను బట్టి ఏర్పాట్లు చేయాలన్నారు. వచ్చే భక్తులకు క్యూలైన్లు, పార్కింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. రోజువారీ భక్తుల రద్దీని బట్టి జిల్లా అధికారుల సహకారం కోరాలని ఆదేశించారు. ప్రత్యేక దర్శనాల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలన్నారు. భక్తులు స్నానాలు ఆచరించే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయాలన్నారు. వరద ఉధృతి దృష్ట్యా ప్రత్యేక షవర్ బాత్‌లను ఏర్పాటు చేసి నదిలోకి వెళ్లకుండా భక్తులను నిరోధించాలన్నారు. అక్టోబరు 4, 18 తేదీలు శనివారాల్లో మందపల్లి శనిత్రయోదశి పూజా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. 18న వాడపల్లి, మందపల్లిలో కార్యక్రమాల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ఆయా దేవాలయాలకు సంబంధించి దేవుళ్ల స్లోగన్స్‌తో తిరుమల మాదిరిగా ప్రచారంచేయాలని,క్యూలైన్లు సమర్థవంతంగా నిర్వహించి అందరికీ దర్శనభాగ్యం కల్పించేలా చూడాలని ఆదేశించారు. డీఆర్వో మాధవి, ఆర్డీవోలు శ్రీకర్, అఖిల, కొత్తపేట డీఎస్పీ మురళీమోహన్, తహశీల్దారు రాజేశ్వరరావు, రాంబాబు, ఎంపీడీవోలు వెంకటరమణ, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

అనధికారికంగా ఆక్వా సాగు



అల్లవరం మండలం ఎన్.రామేశ్వరంలోని డి-పట్టా భూముల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న ఆక్వా చెరువులు

» రామేశ్వరం డి-పట్టా భూముల్లో నిర్వహణ
» మత్స్యకారుల జీవనోపాధికి గండి
» పర్ర భూముల్లో మూసుకుపోతున్న మొగ
» ఆందోళన దిశగా మత్స్యకారులు

అల్లవరం,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు వేటాడుకునేందుకు గతంలో ప్రభుత్వం కేటాయించిన డి-పట్టా భూముల్లో పెద్దల ముసుగులో అనధికార ఆక్వాచెరువులవల్ల వేట మత్స్యకారుల జీవనోపాధికి గండి ఏర్పడింది. జిల్లాలోని అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరంలో 1994లో మత్స్యకారులు, మహిళలకు ఇచ్చిన డి-పట్టా భూములు అన్యాక్రాంతమై కొందరు పెద్దలు ఆక్వా సాగుకు లీజుకు ఇవ్వడంవల్ల వేట వృత్తి సాగక జీవనోపాధి కోల్పోతున్నామని పలువురు మత్స్యకారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డి-పట్టా భూముల్లో అనధికార ఆక్వా సాగును రెవెన్యూ, మత్స్యశాఖలు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు వివాదాలు తలెత్తాయి. విద్యుత్‌శాఖఆధ్వర్యంలో ఈ చెరువులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. నక్కా రామేశ్వరం బ్రిడ్జి సమీపం పంచనది డ్రెయిన్ పక్కన నదీపాతంలో 32ఎకరాల ఏక్‌సాల్ లీజు భూముల్లో సైతం అనధికార ఆక్వా సాగు యథేచ్ఛగా సాగుతోంది. గ్రామంలోని కొందరు పట్టాదారులకు డబ్బు ఆశ చూపి చెరువులు తవ్వేయడంతో చాలామంది వేటాడుకునే అవకాశం లేక అల్లాడిపోతున్నారు. లక్షలాది రూపాయల లీజు సొమ్ము పెద్దల ముసుగులో లాగేస్తున్నారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ భూముల్లో ఆక్వాసాగుపై గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని, ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు.1994లో అప్పటి కలెక్టర్ సమీర్‌శర్మ, ఆర్డీవో ఉషారాణి జోక్యంతో పేదలైన తమకు ఏక్‌సాల్ లీజుగా ఇచ్చిన పట్టా భూముల్లో ఆక్వా చెరువులు తవ్వి తమ పొట్ట కొడుతున్నారని మత్స్యకార మహిళలు ఆరోపించారు. దీంతో మత్స్యకార గ్రామంలో వివాదాలు పెరిగిపోయాయి. ఆ భూముల లీజు సొమ్ము పేద మత్స్యకారులకు అందక వేటాడుకునేందుకు పర్రభూములు చెరువులుగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ ఆందోళన చేసేందుకు మత్స్యకారులు, మహిళలు రంగం సిద్ధం చేసుకున్నారు.

పుణ్యక్షేత్ర దర్శనాలకు ఆర్టీసీ బస్సులు

రావులపాలెం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):పుణ్యక్షేత్ర దర్శనాలకు కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ సూచనల మేరకు జిల్లా పుణ్యక్షేత్ర దర్శిని సౌకర్యార్థం ఆల్ట్రా డీలక్స్ బస్సులను ఏర్పాటు చేసినట్లు రావులపాలెం డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. ఈ బస్సులు ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు రావులపాలెంనుంచి బయలుదేరి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనం, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, కుండలేశ్వరం కుండలేశ్వరస్వామి, మురమళ్ల వీరేశ్వరస్వామి, ముక్తేశ్వరం క్షణముక్తేశ్వరస్వామి, అయినవిల్లి వినాయక ఆలయం,వానపల్లి పళ్లాలమ్మ, పలివెల ఉమాకొప్పేశ్వర స్వామి దర్శనాలఅనంతరం అదేరోజు సాయంత్రం రావులపాలెం డిపోకు చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర రూ.460గా నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలి: విద్యుత్‌శాఖ ఎస్ఈ

అమలాపురం రూరల్,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రతిఇంటిపై విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన పెంపొందించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ రాజేశ్వరి సూచించారు. ప్రతినియోజకవర్గంలో 10వేల సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకునేలా సీఎం చంద్రబాబు కార్యాచరణ సిద్ధం చేశారన్నారు. ఈదరపల్లిలోని విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్లు, వెండర్లతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో 1500సోలార్ రూఫ్‌టాప్‌లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు.గ్రామీణప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి సోలార్ విద్యుత్‌పై ప్రజల్లోఅవగాహన కల్పిస్తున్నామన్నారు. పీఎం సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన సేవాకార్యక్రమాన్ని ఈనెల 17 నుంచి ప్రారంభించి అక్టోబరు 2 వరకు జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబరు 1న జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అమలాపురం గడియార స్తంభంసెంటర్ వరకు పీఎం సూర్యఘర్‌పై అవగాహనర్యాలీ నిర్వహిస్తామన్నారు. బ్యాంకులు బిల్లులు విడుదల చేయకపోవడంవల్ల ఇబ్బందులను వెండర్లు ఎస్ఈ దృష్టికి తీసుకువచ్చారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ఈ ఏడాది డిసెంబరు31 వరకు గడువు ఉందన్నారు.

రత్నగిరిపై అగ్నిప్రమాదం

ఫ్యాన్సీషాపు గొడౌన్ దగ్ధం

రూ.10 లక్షల ఆస్తినష్టం



పశ్చిమ రాజగోపురం వద్ద దగ్ధమవుతున్న గొడౌన్

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో శుక్రవారం వేకువజామున 4 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవించింది. షార్టు సర్క్యూట్ కారణంగా ఫ్యాన్సీషాపు గొడౌన్ అగ్నికి ఆహుతైంది. ఈ మంటలు పక్కనున్న రెండు గొడౌన్లకు వ్యాపించగా అక్కడ స్వల్ప నష్టం కలిగింది. తుని అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. ఫ్యాన్సీ షాపును మార్నీడి భాస్కరరావు లైసెన్స్ హక్కుపొందారు. సుమారు రూ.10లక్షల ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఈవో వీర్ల సుబ్బారావు, పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి పరిశీలించారు. దీనిపై నివేదికను దేవదాయ కమిషనర్‌కు పంపుతామని లీజుల విభాగం అధికారులు తెలిపారు. నిబంధనల మేరకు గొడౌన్ కేటాయించారా లేదా అనేదానిపై ఈవో సంబంధిత అధికారులను అడగగా సంబంధింత ఫైలు కనిపించలేదని చెప్పినట్టు సమాచారం.

కపిలేశ్వరపురంలో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండి చోరీ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలోని చప్పిడి శ్యాంప్రసాద్ ఇంట్లో 25 గ్రాముల బంగారం, 32 తులాల వెండిని గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్టు అంగర ఏఎస్ఐ ఆర్.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన చప్పిడి శ్యాంప్రసాద్, ధనలక్ష్మి దంపతులు మంగళవారం బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంటికి తిరిగి రాగా తలుపు తాళాలు, బీరువా తాళాలు, పగలగొట్టి బంగారం, వెండి దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం మండపేట సీఐ దొరరాజు, ఆధ్వర్యంలో జిల్లా క్లూస్‌టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలు సేకరించారు. చప్పిడి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

లారీ చోరీపై కేసు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాలచర్లలో హైవే రహదారిని ఆనుకుని ఉన్న కాటా వద్ద పార్క్ చేసిన లారీ చోరీకి గురైందని పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. దివాన్‌చెరువుకు చెందిన అబ్బిరెడ్డి నాగేశ్వరరావుకు పాలచర్ల పంచాయితీలో హైవేపై ఎఎస్ఆర్ కాటా ఎదురుగా శ్రీకృష్ణ ఇన్ఫ్రా పేరుతో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ ఉంది. గణేశ్వరరావు బంధువులను కలిసేందుకు హైదరాబాద్ వెళ్తూ తన నాలుగు లారీలను కాటా ఎదురుగా గురువారం పార్క్ చేశాడు. రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం 11గంటలకు వెళ్లి చూసేసరికి షాప్ దగ్గర నాలుగు లారీలకు మూడు మాత్రమే ఉన్నాయి. ఏపీ39 డబ్ల్యూసీ 7729 నెంబరు గల లారీ కనపించక ఎవరో దొంగిలించుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజానగరం ఎస్ఐ కె.ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

అన్నవరంలో గంజాయితో వ్యక్తి అరెస్ట్


గంజాయితో వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

అన్నవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం జాతీయ రహదారిపై శుక్రవారం గంజాయి తరలిస్తున్న తమిళనాడు కాంచీపురానికి చెందిన ఉత్తమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని అన్నవరం ఎస్ఐ హరిబాబు తెలిపారు. అతడి నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచామన్నారు.

పాము కాటేస్తే.. పర్లేదని పూజలు

పరిస్థితి విషమించి ఆదివాసీ మృతి

ఎటపాక, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) పాము కాటుతో వలస ఆదివాసీ మృతి చెందిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని చింతలపాడువలస గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడకం జోగయ్య (34) రోజు మాదిరిగానే ఇంట్లో నేలపై నిద్రించాడు. శుక్రవారం తెల్లవారుజామున జోగయ్యను పాము కాటేసినట్టు కుటుంబ సభ్యులకు చెప్పాడు. కానీ పర్లేదులే అన్నట్టు జోగయ్యను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా మంత్రాలతో పూజలు చేసి నాటు వైద్యంతో ఇంట్లోనే ఉంచి సపర్యలు చేశారు. దీంతో ఆరోగ్య పరిస్థితి విషమించి జోగ య్య మధ్యాహ్నం ఇంటి వద్దే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. నెలరోజుల క్రితం జోగయ్య దంపతులకు మగ బిడ్డ పుట్టాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.


మృతిచెందిన జోగయ్య

కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి..

సాయంత్రానికి శవమై తేలి..


చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది


వరప్రసాద్ (ఫైల్)

గొల్లప్రోలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పూజ నిమిత్తం కలువ పువ్వుల కోసం చెరువులోకి దిగి వ్యక్తి గల్లంతయ్యాడు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని రైల్వే స్టేషన్ వీధికి చెందిన మడబాల వరప్రసాద్ (30) శుక్రవారం ఆలయంలో పూజల కోసం సూర్యుడు మంచినీటి చెరువులోకి దిగాడు. కలువ పువ్వులు కోసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. దీంతో స్థానికులు, ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది గాలించారు. సాయంత్రానికి మృతదేహం లభ్యమైంది. అతడు తాపీ పనిచేసి జీవనం సాగిస్తూ ఉంటాడు. భార్యతో విడాకులు తీసుకున్నాడు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణ శోభితం... మహాశక్తి యాగం

- కల్యాణ రాముని ఉత్సవ విగ్రహం, బంగారు పాదుకలు, బాణం ప్రదర్శన
- వీక్షించిన వేలాది మంది భక్తులు
- 60 కోట్లకు చేరిన లలితా సహస్రనామ కుంకుమార్చనలు


అయోధ్య శ్రీరాముని విగ్రహం, బంగారు పాదుకలు, ధనుర్బాణం


పూజిస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠంలో మహాశక్తి యాగం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. అయోధ్య నుంచి తెచ్చిన బంగారు కల్యాణ రాముని విగ్రహం, బంగారు పాదుకలు, బంగారు ధనుర్బాణాన్ని వీక్షించి భక్తులు పులకించారు. వంద కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చన 60కోట్లకు చేరింది. సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మొదటిసారి మహాశక్తి యాగానికి శ్రీరాముడు పాదుకలు రాగా రెండోసారి ధనుర్బాణాలు వచ్చాయన్నారు. ఇప్పుడు బంగారు రాముడు, ఆయుధాలు రావడం యాదృచ్ఛికమన్నారు. మంత్రం ఫలించాలంటే మనసు ప్రధానమని, భావం దృఢంగా ఉంటే మంత్రం చెప్పకపోయినా ప్రకృతి దానికి సహకరిస్తుందన్నారు. అయోధ్యలో రూ.200 కోట్లతో కల్యాణ రాముడు గుడి నిర్మిస్తున్నామని, ఈ విగ్రహ శంకుస్థాపనకు స్వామీజీని ఆహ్వానిస్తున్నట్టు అయోధ్యకు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి తెలిపారు. తెలుగువాళ్ల కోసం వసతి, ఉచిత భోజనం అమలు చేస్తున్నామన్నారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ దుర్గాసూక్త, ప్రత్యంగిర హోమాలు నిర్వహించారు. అయోధ్య నుంచి తీసుకువచ్చిన బంగారు కల్యాణరాముని ఉత్సవ విగ్రహం, పాదుకలు, కోదండం, ధనుర్బాణం ప్రదర్శించారు. 50వేల మంది భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు, ట్రాఫిక్ సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, రత్నం, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ పెరుగుతున్న వరద

- భద్రాచలం వద్ద 44.7 అడుగుల నీటిమట్టం
- చింతూరు డివిజన్‌లో పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- అప్రమత్తంగా ఉండాలి : పీవో


ఉధృతంగా ప్రవహిస్తున్న సోకిలేరు వాగు వద్ద వాహనాదారుల పాట్లు

చింతూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి, శబరి నదులు మళ్లీ పెరుగుతున్నాయి. దీంతో లోతట్టువాసులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి 44.7 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి నది శబరి నదికి ఎగపోటు నివ్వడంతో శబరి ఉధృతి కూడా పెరుగుతోంది. దీంతో చింతూరు- వరరామ చంద్రపురం మండలాల నడుమ సోకిలేరు వాగు ఉధృతి పెరిగింది. ఈ క్రమంలో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలోని కోండ్రాజపేట, టేకులబోరు నడుమ, వరరామ చంద్రపురం మండలంలో తుష్టివారిగూడెం అడవి వెంకన్నగూడెం నడుమ చింతరేవుపల్లి కన్నయ్యగూడెం నడుమ, ఎటపాక మండలంలోని నెల్లిపాక వీరాయిగూడెంల నడుమ కన్నాయిగూడెం గట్టుగూడెంల నడుమ చింతూరు మండలం, వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో లోతట్టు వాసులు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో శుభం నొక్వాల్ పేర్కొన్నారు. చేపల వేటకు ఎవరూ వెళ్లవద్దని ఆయన సూచించారు.


వరదనీటిలో గండిపోశమ్మ ఆలయం పై భాగం

వరద నీటిలోనే గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత 3 రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి పెరుగుతోంది. ముంపు పరివాహ ప్రాంతాలకు వరద నీరు చేరుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయ పైభాగం వరకు వరద నీరు చేరింది. పాపికొండలు వెళ్లే పర్యాటక బోట్లు వరదల కారణంగా నిలిపివేశారు.

కాకినాడ మత్స్యకారులకు విముక్తి

52 రోజుల తర్వాత

శ్రీలంక జైలు నుంచి విడుదల

రాజ్యసభ ఎంపీ సానా సతీష్ కృషి


శ్రీలంక జైలు నుంచి విడుదలైన నలుగురు మత్స్యకారులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జాఫ్నా జైలులో 52 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు కె.శ్రీను వెంకటేశ్వర్లు, కర్రి నూకరాజు బుర్రయ్య, చందా నాగేశ్వరరావు, పంతాడి బ్రహ్మానందంలకు విముక్తి లభించింది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు గురువారం ఏపీ భవన్ కమిషనర్ డాక్టర్ అర్జా శ్రీకాంత్, శ్రీలంక కోస్ట్‌గార్డ్ కమాండర్ దినేష్ జేతో ప్రత్యేక సమన్వయం జరిపి కోర్టు నుంచి మళ్లీ స్పష్టమైన అనుమతులు వచ్చేలా కృషి చేయడంతో మత్స్యకారులు జైలు నుంచి విడుదలై స్వదేశానికి చేరుకున్నారు. వారిని శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేయగా శ్రీలంక నావికా దళం అధికారులు అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖ వరకు తీసుకువచ్చి సాయంత్రం రామేశ్వరంలోని మండపం బేస్ సమీపం వద్ద భారత కోస్ట్ గార్డ్ అధికారులకు అధికారికంగా అప్పగించారు. గత ఆగస్టులో మత్స్యకారులు నాగపట్నం వెళ్లి పాత ట్రాలర్ పడవ కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా నావిగేషన్ లోపం కారణంగా శ్రీలంక సముద్ర జలాల్లోకి ప్రవేశించారు. దీంతో శ్రీలంక నావికా దళం గత ఆగస్టు 4న వారిని అదుపులోకి తీసుకుని జాఫ్నా జైలులో ఉంచారు. జాఫ్నాలోని కయిట్స్ సివిల్ కోర్టు సెప్టెంబరు 12న వారి విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. ట్రాలర్‌ను కూడా తిరిగి ఇవ్వాలని ఆ కోర్టు ఆదేశించినా అనుసంధాన లోపాలు, ప్రక్రియల ఆలస్యం వల్ల మత్స్యకారుల స్వదేశీ రాక ఈనెల 25 వరకు వాయిదా పడింది. మత్స్యకారుల విడుదలైనట్టు ఎంపీ వెల్లడించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి

కేసు నమోదు

రాజానగరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతనామవరానికి చెందిన వివాహిత సయ్యద్‌హీరా (22) అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. దీనికి సంబంధించి ఎస్ఐ జీవీవీ.సత్యనారాయణ శుక్రవారం విలేకర్లకు తెలిపిన వివరాలు ఈవిధంగా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం అంబేడ్కర్ కాలనీకి చెందిన షేక్ వల్లీ తన కుమార్తె సయ్యద్ హీరాను పాతనామవరానికి చెందిన సయ్యద్‌బషీరుద్దీన్‌కు ఇచ్చి సుమారు ఐదేళ్ల క్రితం వివాహం చేసింది. అప్పటి నుంచి వారు పాతనామవరం ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల తమ అల్లుడు, అతడి తల్లి సయ్యద్ హమదున్నీసా, సాహిత్, బషీర్లు, మామగారైన బాజీ వీరందరూ కలసి తమ కుమార్తెను కట్నం కోసం రోజూ తిడుతూ వేధించారని మృతురాలి తల్లి పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఈనెల 21న కుమార్తెను చూడడానికి నామవరం ఇంటికి వెళ్లగా కుమార్తె తల్లికి తన కష్టాలు చెప్పుకుని బాధపడింది. అయితే సర్దుకుపోవాలని కుమార్తెకు నచ్చచెప్పింది. అయితే తన కుమార్తె గురువారం మరణించిందని చెప్పారని.. తమ అల్లుడు, వారి బంధువులు చంపి ఉంటారని అనుమానంగా ఉందని షేక్ వల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేయగా నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాలక్ష్మిదేవిగా..


కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని రూ.8లక్షల కరెన్సీతో అలంకరించారు. - కరప (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలో కనకదుర్గమ్మను రూ.4.50 లక్షల కరెన్సీతో మహాలక్ష్మిగా అలంకరించారు. - పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి)


కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణాదేవి ఆలయంలో అమ్మవారికి రూ.1,11,116 కరెన్సీతో అలంకరణ -ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి)


కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో వనదుర్గ, కనకదుర్గ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. -అన్నవరం (ఆంధ్రజ్యోతి)

అభివృద్ధిలో క్రీడారంగం కీలకం

రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి.. ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీ



బరిలో క్రీడాకారిణులు, మ్యాచ్‌లను తిలకిస్తున్న బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డివాసు



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశమైనా, రాష్ట్రమైనా పురోభివృద్ధి చెందాలంటే క్రీడారంగం ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తుందని రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆర్ఎంసీ బ్యాడ్మింటన్ కోర్టులో జరుగుతున్న ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2025 పోటీలు శుక్రవారం పోటా పోటీగా సాగాయి. రెండో రోజున జరిగిన ప్రీ క్వార్టర్ ఫైనల్స్ పోటీలను బీవీఆర్ టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలసి మ్యాచ్‌లను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. క్రీడల అభివృద్ధికి రుడా నుంచి కూడా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్రీడల నిర్వహణలో రాజమహేంద్రవరం అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఆర్చరీ

పోటీలకు ముగ్గురి ఎంపిక



పిఠాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా గోపన్నపాలెం ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో శుక్రవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి ఆర్చరీ పోటీలు జరిగాయి. ఇందులో కాకినాడ జిల్లా పిఠాపురం సీబీఆర్ డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థి పి.కృష్ణ, సూర్యరాయ డిగ్రీ కళాశాల ఫస్టియర్ విద్యార్థిని కె.హరిణి, జి.మామిడాడ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల పీఈటీ ఫస్టియర్ విద్యార్థి పి.లోకేష్ విజేతలుగా నిలిచారు. ఈ ముగ్గురినీ ఇండియన్ రౌండ్ నన్నయ యూనివర్సిటీ మెన్, ఉమెన్ టీమ్ సభ్యులుగా ఎంపిక చేశారు. వీరు పంజాబ్ రాష్ట్రంలో జరుగబోయే జాతీయ స్థాయి ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారు. విజేతలు పిఠాపురానికి చెందిన ఆర్చరీ కోచ్ పి.లక్ష్మణరావు వద్ద శిక్షణ పొందుతున్నారు.

29న నిధి ఆప్‌కే నికత్

పీఎఫ్ ప్రాంతీయ అసిస్టెంట్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈ నెల 29న 'నిధి ఆప్‌కే నికత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం'ని నిర్వహిస్తున్నామని ప్రాంతీయ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. ఈపీఎఫ్‌ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, ఇతర ఫిర్యాదుల దాఖలులో నిబంధనలు, క్లెయిమ్‌ల తిరస్కరణకు కారణాలు, స్కీమ్ సర్టిఫికెట్ వల్ల ప్రయోజనాల వంటి వివిధ అంశాలను వివరించడం, ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవర్ కాబడిన వారు తమ ఫిర్యాదులను నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ సమర్పించాలని చెప్పారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు ఈ క్యాంపులో వాటిని అందజేయవచ్చని అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ పేర్కొన్నారు. ఏలూరు జిల్లా గోపాలపురంలోని శ్రీ సర్వారాయ షుగర్స్ బాట్లింగ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్, కాకినాడ జిల్లా తునిలోని శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్, కోనసీమ జిల్లా యానాం అడవిపాలెంలో వాసవీ పిగ్మెంట్స్, తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రి సమీపంలోని వెంకటాపురం జీఎస్ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో నిధి ఆప్‌కే నిఖత్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పి.గన్నవరం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడిలో శ్రీమసేనమ్మనుశుక్రవారం రూ.4.20 లక్షలతో శ్రీమహాలక్ష్మిగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పి.గన్నవరం శివారు తాటికాయల వారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మ శ్రీమహా లక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. గ్రామాల్లో శ్రీకనకదుర్గ ఆలయాల్లో కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ సోముకు ధన్యవాదాలు

రాజోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల రైతుల బాధలు, శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ గురించి శాసనమండలిసభలో ప్రస్తావించిన బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు గోదావరిసెంట్రల్‌డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. రాజోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు.

మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ దర్శనం



ముమ్మిడివరం, అంబాజీపేట, ఉప్పలగుప్తం, మలికిపురం, పి.గన్నవరం మండలాల్లో కనకదుర్గమ్మను కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించిన దృశ్యాలు

అల్లవరం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరి, అల్లవరం, గోడిలంక, గోడితిప్ప, బెండమూర్లంక, దేవగుప్తం, యెంట్రుకోన, డి.రావులపాలెం, బోడసుకర్రు, సామంతకుర్రు, గోపాయిలంక, కోడూరుపాడు, ఓడలరేవు గ్రామాల్లో దుర్గాదేవికి కుంకుమ పూజలు నిర్వహించారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): శివకోడు కందికట్టు వారిగ్రూపులో శ్రీకనకదుర్గమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకుడు కడియాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవార్ని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): చినకొత్తలంకలోని శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో విజయదుర్గమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రూ.1.75లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. రాణేలంక పంచాయతీ పరిధిలోని గోదశివారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మను ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారినిరూ.30లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు.పళ్లవారిపాలెంలోని విజయదుర్గమ్మను ఆలయ కమిటీవారు లక్షలాది రూపాయల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిదేవిగా అలంకరించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవార్ని శుక్రవారం లలితాదేవిగా అలంకరించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లో ఉన్నశ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం, అంబాజీపేట విజయభేతాళస్వామి ఆలయం, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరంలోని వారాహి అమ్మవార్ని అమలాపురం శ్రీవారాహిఫ్యాన్సీ యజమాని సహకారంతో 3వేల మట్టిగాజులతో అర్చకులు సూర్యనారాయణ అలంకరించారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రులను పురస్కరించుకుని తూర్పుపాలెం కురసాల సత్యనారాయణ ఆవరణలో ఉన్న కనకదుర్గమ్మవారిని రూ.100కరెన్సీ నోట్లతో అలంకరించారు. పలువురు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉప్పలగుప్తం,(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాంలో శుక్రవారం దుర్గాదేవి శ్రీమహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. రూ.3లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియాంపేట రోడ్డులోని పాలకనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవార్ని రూ.లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అర్చకులు కామేశ్వరశర్మ నేతృత్వంలో అమ్మవార్ని పూజలు నిర్వహించారు. త్యాగరాజువీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో అమ్మవారు రాజమాతాంగి అలంకరణలో దర్శనమిచ్చారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా..

29న కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాట సమితి పిలుపునిచ్చింది. శుక్రవారం అమలాపురంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల29న సమనసలోని ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, ఇతర సంఘాలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని మానవహక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి పిలుపునిచ్చారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు రేట్లు వసూలు చేయాలి

మలికిపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): నూతన జీఎస్టీ రేట్లు సెప్టెంబరు 2నుంచి అమలులోకి రావడంతో 375వస్తువులపై ధరలు తగ్గాయని, అయితే పన్ను తగ్గింపును వినియోగదారులకు ఇవ్వకుండా వ్యాపారస్తులు వారివారి లాభాల కోసం పాత ధరలకే వినియోగదారులకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లాకన్స్యూమర్ ప్రొడక్ట్ కౌన్సిల్ మెంబర్ మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. అటువంటి వ్యాపారస్తులపై అధికారుల ద్వారా కేసులు నమోదు చేయిస్తామన్నారు.

చెయ్యేరులో వైద్య శిబిరం

కాట్రేనికోన, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తి అభియాన్ వైద్యశిబిరాన్ని శుక్రవారం చెయ్యేరులో సర్పంచ్ చెల్లి సురేష్ అధ్యతన జరిగింది. ఈకార్యక్రమంలో నడింపల్లి సుబ్బరాజు, త్సవటపల్లి నాగేంద్రరావు, నంద్యాల వెంకటేశ్వరరావు, గిడ్డి చంటిబాబు, పెయ్యల ముత్యాలరావు, నామ వెర్రిబాబు, కొంకి శ్రీను, మోర్త వర్మ, మట్ట సూరిబాబు, త్సవటపల్లి బీవీ నారాయణస్వామి, బొక్కా శ్రీరామమూర్తి, గుత్తుల సూర్యమహాలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలు

అంబాజీపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): చిరతపూడి సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలందిస్తామని చైర్‌పర్సన్ రంపం సత్యనారాయణ పేర్కొన్నారు. చిరతపూడిసొసైటీ కార్యాలయం వద్ద ఆయన అధ్యక్షతన మహాజన సభ జరిగింది. కూటమి ప్రభుత్వం రైతులకు అనేకపథకాలను ప్రవేశపెట్టిందన్నారు.

స్వస్థ నారీ.. అభియాన్ ఆరోగ్య శిబిరం

అంబాజీపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండలం ఇసుకపూడి, ఇరుసుమండ గ్రామాల్లో ఆయా సర్పంచ్‌లు తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, అక్కిశెట్టి నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కేఎన్ శ్రీనివాస్, టి.దివ్య, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ చైర్‌పర్సన్ సుంకర గణపతిరావు, చిన్నం బాలవిజయరావు, అక్కిశెట్టి సత్యనారాయణ (పెద్ద), సుంకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

యానాం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):యానాం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి 9,11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.సి.కీర్తి తెలిపారు. 8వతరగతి చదువుతోన్న అభ్యర్థులు 9వతరగతి ప్రవేశ పరీక్షకు, 10వతరగతి చదువుతోన్న వారు ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి7న పరీక్ష జరుగుతుంది.

యానాంలో మత్స్యశాఖ కార్యదర్శి పర్యటన

యానాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యానాంలో పుదుచ్చేరి మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ డి.మణికంఠన్ పర్యటించారు. సావిత్రినగర్, గిరియాంపేట గ్రామాల్లో పర్యటించారు. ఫిషింగ్ హర్బర్, పలు పెండింగ్ అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, పుదుచ్చేరి మత్స్యశాఖ అధికారులు పువ్వల మీరాసాహెబ్ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు ఏఎంసీ చైర్మన్ కృతజ్ఞతలు



రాజోలు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను రాజోలు ఏఎంసీ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాజోలు నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం, భవిష్యత్తు ప్రగతి దిశగా తదితర అంశాలపై సీఎం చంద్రబాబుతో చర్చించానని తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ప్రజలక ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఏఎంసీ చైర్మన్ వెంకటలక్ష్మి తెలిపారు.

ప్రతీ మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

అంతర్వేది, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా డ్వాక్రా పీడీ జైచంద్రగాంధీ అన్నారు. సఖినేటిపల్లి వెలుగు కార్యాలయం వద్ద పరిశ్రమల శాఖ, మహిళల ఆధ్వర్యంలో ప్రత్యేక ఎంఎస్ఎంఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పీడీ జైచంద్రగాంధీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు పారిశ్రామికంగా వృద్ధి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రుణాలు పొందడమే కాకుండా పదిమందికి ఉపాధి కల్పిస్తూ కొత్త వినూత్నమైన ప్రాజెక్టులను సిద్ధం చేసుకోవాలన్నారు .

రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలి

పి.గన్నవరం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):రైతులు తీసు కున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ముంగండ సొసైటీ చైర్మన్ మట్టపర్తి వెంటేశ్వరరావు రైతులను కోరారు. ముంగండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం మహాజనసభ నిర్వహించారు. ఈసమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంపీటీసీ పులపర్తి రాజారావు, త్రిమన్ కమిటీ సభ్యులు నూలు రమేష్, యల్లమిల్లి కృష్ణవేణి, సీఈవో పోలిశెట్టి శేషగిరిరావు, పితాని రాంబాబు పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగం సాధించిన వీఆర్వో



ముమ్మిడివరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అనాతవరం గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న బాలాజీ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ఇంగ్లీషు సబ్జెక్టులో స్కూలు అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో 77వ ర్యాంకు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ కృషి పట్టుదలతో చదువుకుని విజయం సాధించారు. తహశీల్దార్ టి.సుభాష్, డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది బాలాజీని అభినందించారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు గొయ్యికి మోక్షం

అల్లవరం,సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి):కొమరగిరిపట్నం సుంకరవారివీధి వద్ద భారీగా ఏర్పడే గొయ్యిని పూడ్చాలని టీడీపీ నాయకుడు పరసా కిరణ్‌కుమార్, పలువురు నాయకులు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సిఫార్సుతో సుంకరవారివీధి వద్ద గొయ్యిలో వెట్‌మిక్స్ కంకరతో శుక్రవారం గొయ్యిని పూడ్పించారు.త్వరలోకొమరగిరిపట్నం సీసీ రోడ్డుగా వెడల్పుతో అభివృద్ధి చేస్తారని వారు తెలిపారు.

విహారయాత్రకు ఎస్ఆర్‌కే విద్యార్థులు

యానాం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): యానాండాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి బీఎస్సీ బొటని, జువాలజీ, ఎంఎస్సీ జువాలజీ నుంచి 40మంది విద్యార్థులు ఎన్ఈపీ కరికులంలో భాగంగా విహారయాత్రకు వెళ్లారు. శుక్రవారం యానాం నుంచి కోరంగి అభయారణ్యం, కాకినాడ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. డాక్టర్ జేవీ సుధాకర్ మడ అడవుల ప్రాముఖ్యత, తదితర మొక్కల గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, డాక్టర్ డి.శాంతికుమార్ క్షేత్రపర్యటనలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఆర్టీఎఫ్ విడుదల చేయాలని నిరసన

ముమ్మిడివరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ట్యూషన్ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరంలోని డాక్టర్ రావుబహాదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కళాశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణకు వినతిపత్రం అందించారు. ప్రిన్సిపాల్ గంధం శ్రీరామమూర్తి, గుర్రం మహేష్, వంగా విశాల, విద్యార్థినులు బొమ్మి కీర్తన, ర్యాలీ అక్షయ, బొంతు వరలక్ష్మి, బొర్రా శివజ్యోతి, నక్క కావ్య పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడ్డ ఆర్టీఎఫ్‌ను వెంటనే విడుదల చేయాలని అల్లవరంలో శ్రీరవితేజ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు శుక్రవారం ఆందోళన, ర్యాలీ చేశారు. ఆర్టీఎఫ్ విడుదల చేయాలని విద్యార్థులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. నిరసన ప్రదర్శనలో అధ్యాపకులు పాల్గొని విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు.

'ఆదాయాన్ని జమ చేయడం లేదు'

ఉప్పలగుప్తం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): వేర్వేరు మార్గాల ద్వారా రావలసిన ఆదాయాన్ని గ్రామపంచాయతీలకు జమచేయకపోవడంపై సర్పంచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో కృష్ణ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీలు ఆర్థిక వనరులు సమీకరణ విధానంపై అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మార్వోలు పెట్టా నాగేశ్వరరావు, ఎండీ షెహన్‌షా మాట్లాడారు. కార్యాలయపాలనాధికారి బి.తులసీకృష్ణ నిర్వహణలో జరిగిన సమావేశంలో పంచాయతీల పేదరికంపై సర్పంచ్‌లు అభిప్రాయాలనువ్యక్తీకరించారు.

పంచాయతీల ఆర్థిక వనరుల పెంపుపై శిక్షణ

మామిడికుదురు, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): పంచాయతీల సొంత ఆర్థిక వనరుల పెంపు, సమగ్ర ఆర్థిక నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు పంచాయతీల ద్వారా వచ్చే ఆదాయ వివరాలను వివరించారు. ఈశిక్షణ కార్యక్రమం రెండు రోజులు జరగనుంది. పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయం, ఖర్చులు, రాబడులు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో కె.వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు వెండి ఆభరణాలు

అంతర్వేది, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలో వెలసి ఉన్న కనకదుర్గమ్మవారికి కనుమూరి రామసీత రూ.61వేలు విలువైన 400గ్రాముల వెండి అభయ, వరద హస్తాలను అమ్మవారికి బహూకరించారు. ఈ ఆభరణాలను గ్రామ మాజీ సర్పంచ్ జంపన బుజ్జిరాజు, ఉపసర్పంచ్ ఇందుకూరి రమేష్‌రాజు, నడింపల్లి రామలింగరాజు సమక్షంలో ఆలయ అర్చకులకు అందించారు. సంప్రోక్షన అనంతరం వెండి ఆభరణాలను అమ్మవారికి అలంకరించారు.

ఓఎన్జీసీ డ్రెయిన్ పనులకు శ్రీకారం

అల్లవరం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు టెర్మినల్ పరిధిలో రూ.3.50కోట్ల ఓఎన్జీసీ నిధులతో డ్రెయిన్ నిర్మాణ పనులకు సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, ఉమామహేశ్వరరావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కొల్లు విష్ణుమూర్తి, జనసేన నాయకురాలు కామాడి గంగాభవానీ, రేకాడి శేషగిరి, మల్లాడి భాను, కోలా సహదేవరావు (బాబులు), చొల్లంగి రాధాకృష్ణ, భాస్కరరావు, మురళీ, పంచాయతీకార్యదర్శి పి.సాయిబాబుపాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలి

మలికిపురం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రతీ కూలీ ఉద్యమించాలని లిబ్‌టెక్ సంస్థ ప్రతినిధి ఎం.రాహుల్ అన్నారు. శుక్రవారం పూలే -అంబేడ్కర్ భవన్‌లో ఉపాధిహామీ చట్టం అమలు, తీరుతెన్నులపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉపాధి కూలీ సంఘం అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో రాహుల్ మాట్లాడారు. ఉపాధి బడ్జెట్‌లో రూ.86వేల కోట్లు కేటాయించారని, ఉపాధి డిమాండ్‌కు తగ్గట్టుగా రూ.3లక్షలు కోట్లు కేటాయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరంధామయ్య అన్నారు.

నిత్యావసరాలను డీలర్లకు అందించాలి

అంబాజీపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మార్కెట్ యార్డులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ ద్వారా రేషన్ షాపుల ద్వారా పేదలకు అందించే నిత్యావసరాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా రేషన్ డీలర్లకు అందించాలని రామచంద్రాపురం ఆర్డీవో డి.అఖిల సూచించారు. గౌడన్లో ఉన్న సరుకులు, రికార్డులను పరిశీలించారు. అలాగే బియ్యం, పంచదార, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్ల నాణ్యతను పరిశీలించారు. ఆమె వెంట తహశీల్దారు బి.చినబాబు, ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు పీవీ రమణ, డి.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, ఐవీ రమేష్ ఉన్నారు.



రాయవరం మండలం వెదురుపాకలోని మహాలక్ష్మి అవతారంలో విజయదుర్గా అమ్మవారు

మహాలక్ష్మీ నమోస్తుతే!

● మహాలక్ష్మిగా అమ్మవార్లు
● ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఏడిదరోడ్డులో పెద్దమ్మతల్లికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



ద్రాక్షారామంలో మహాలక్ష్మీ దేవిగా మాణిక్యాంబ



ఆలమూరు :చింతలూరు నూకాంబికా అమ్మవారు



ద్వారపూడి వాసవీమాత అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరణ



ద్వారపూడి కలశాలతో ఊరేగుతున్న భవానీలు



మహాలక్ష్మీదేవిగా వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారు

రాయవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం వెదురుపాక విజయదుర్గా అమ్మవారు శ్రీమహాలక్ష్మి అమ్మవారిగా అలంకరించి పూజలందుకుంది. మహాలక్ష్మి అవతారం సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల ఆభరణాలు, పూలదండలు, నగదు దండలతో ప్రత్యేకంగా అలంకరించి లక్ష్మీ అష్టోత్తర, సహస్రనామాలతో కుంకుమ పూజలు చేశారు. పీఠంలో మహిళలచే సామూహిక శ్రీచక్ర అర్చనలు జరిపించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తలనుద్దేశించి మహాలక్ష్మి అమ్మవారి అవతా రం విశిష్టతను, అమ్మవారిని పూజించడంవల్ల కలిగే శుభాలను వివరించారు. పీఠంలో ఆధ్యాత్మిక వేత్తలు దూళిపాళ్ల మహదేవమణి, కె.మైశర్మ తదితరులు మహాలక్ష్మి అమ్మవారి అవతారం, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గ సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, అన్నవరం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఐదోరోజు అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

మహాలక్ష్మీదేవిగా వానపల్లి పళ్లాలమ్మ

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): దసరాను పురస్కరించుకుని ఉభయగోదావరి జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన వానపల్లి పళ్లాలమ్మ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అమ్మవారి అవతారంలో భక్తులకు దర్శనమించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బి.వెంకటరమణమూర్తి, దేవ దాయశాఖ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు భక్తులకు కల్పించారు.

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ఆలయాలలో అమ్మవార్లు మహాలక్ష్మి అమ్మవారిగా దర్శనమిచ్చారు. శుక్రవారం అమ్మవారికి పర్వదినం కావడంతోపాటు శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు మహాలక్ష్మికి దర్శనమివ్వడంతో మహిళా భక్తులు ఆలయాలకు పోటెత్తారు. చింతలూరు నూకాంబికా అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. చెముడులంక, మడికి, ఆలమూరు, మూలస్థానం, జొన్నాడ, చొప్పెల్ల, నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, నవాబుపేట, పెనికేరు, కలవచర్ల, పెదపళ్ల, చింతలూరు, పినపళ్ల, సంధిపూడి, సూర్యారావుపేట గ్రామాలలో వివిధ ఆలయాలవద్ద కూడలిలలో ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమలవద్ద సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని చెముడులంక కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటుచేసిన శరన్నవరాత్రి ఉత్సవాల అమ్మవారి ప్రతిమవద్ద వందలాది మంది భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్న వరాత్రి ఉత్సవాలు భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఐదోరోజు అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఊడిమూడిలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపంలో మాజీ సొసైటీ అధ్యక్షు డు సాదా వెంగళరావు ఐదుకిలోల చాక్లెట్‌లతో తయారుచేసిన దండను అమ్మవారికి అలంక రించారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వస్తున్నారు. ఇందులో భాగంగా ఐదవరోజు శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఉచ్చిలి కాలువరేవులో ఉన్న శ్రీ విజయదుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాడపల్లి, ర్యాలి, రాజవరం, పేరవరంతో వివిధ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, పందిర్లలో భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ దీక్షదారులు పూజలు నిర్వహించారు.

కరెన్సీ నోట్లతో అమ్మవారి అలంకరణ

ర్యాలి అన్నపూర్ణదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అన్నపూర్ణాదేవికి మహాలక్ష్మీదేవిగా 1,11,116 రూపాయల కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించారు. స్థానిక మ్యూజిక్‌హౌస్‌లో చిన్నారులకు దుర్గాదేవి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులకు నిర్వాహకుడు చింతా శ్యామ్ కుమార్ బహుమతులు అందజేశారు. చిన్నారులు అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది.

సామూహిక కుంకుమ పూజలు

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): ఈతకోట జాతీయ రహదారి చెంతనే ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతనే ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఈతకోటలోని సత్తెమ్మతల్లి పీఠంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కొత్తపేట నియోజకవర్గ రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావుతోపాటు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, కోరుమిల్లి, మాచర, కాలేరు, వల్లూరు, తదితర గ్రామాల్లో శుక్రవారం 5వరోజు మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో, కూడళ్లలో ఏర్పాటుచేసిన అమ్మవార్లకు వేదపండితులు, ఆయా ఆలయాల అర్చకులు అభిషేకాలు, కుంకుమ, తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామస్థులతోపాటు మహిళలు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్షా ఇరవై వేలతో అలంకరణ

మండపేట(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ద్వారపూడి వాసవీమాత ఆలయంలో శుక్రవారం రూ.లక్షాఇరవైవేల నగదుతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా భవానీల కలస పూజ

మండలంలోని ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల వేములపల్లిలో ఉన్న శ్రీవిజయ కనకదుర్గ అమ్మవారి దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తీర్దబిందెల సంబరంను నిర్వహించారు. అధికసంఖ్యలో భవానీలు తీర్దబిందెలను ఎత్తుకుని ఊరేగించారు. కేరళ కళాకారులు, వాయిద్యాలు నృత్యాలు వేషధారణలు అందరి నీ ఆకట్టుకున్నాయి.

ఘనంగా పెద్దమ్మ తల్లి దసరా వేడుకలు

మండపేట ఏడిదరోడ్డులో ఉన్న శ్రీపెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఆలయ వ్యవస్థాపకుడు వాలిన వీరబాబు సారథ్యంలో అమ్మవారికి శుక్రవారంరాత్రి దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు, నిప్పుల గుండాలను నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్ధ ప్రసాదాలను స్వీకరించారు. వేదపండితులు వేదమంత్రాలు నడుమ జరిగిన ప్ర త్యేక పూజకు భారీసంఖ్యలో భక్తులు భవానీలు తరలివచ్చి పాల్గొని తీర్ధప్రసాదాలను స్వీకరించారు.

'స్వస్థ నారీ సశక్త్' వైద్య శిబిరాలు

సద్వినియోగం చేసుకోండి'



ఆలమూరులో స్వస్థనారీ అభియాన్ పథకం గురించి వివరిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకర్

ఆలమూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన స్వస్థనారీ సశక్త్ అభియాన్ పథకం వల్ల మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని ఈపథకాన్ని మహిళలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ శివశంకర్ సూచించారు. ఆలమూరులో శుక్రవారం స్వస్థనారీ పథకంపై అవగాహన కల్పించి మహిళలకు అసంక్రమిత వ్యాధులపై స్క్రీనింగ్‌తోపాటు పలు రకాల పరీక్షలను నిర్వహించారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సిరిగినేడి పట్టాభి, కూటమి నాయకులు వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల రాంబాబు, రామానుజుల శేషగిరిరావు, కేతా రాంబాబు, బి.రాంబాబు, చల్లా ఏడుకొండలు, వైద్యులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసింది. దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కుందూరు ఆసుపత్రి వైద్యుడు నరేంద్ర అన్నారు. శుక్రవారం కోటిపల్లి గ్రామ పంచాయతీ వద్ద నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. మహిళల ఆరోగ్య రక్షణకోసం చేస్తున్న పరీక్షలు వివరించారు. పలురకాలు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మహిళా ఆరోగ్య పరిరక్షణ కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి, కూటమినాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, కర్రి చిట్టిబాబు, చీకట్ల సోమేష్, పప్పుల సాయిబాబు, పెమ్మాడి సత్తిబాబు, హోమియోపతి వైద్యులు మిధున్ వైద్య సిబ్బంది అరుణ, నాగమణి పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉచ్చిలిలో శుక్రవారం స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. సర్పంచ్ ఉర్రింకల మీరమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు, ఎంపీటీసీ మట్టా లక్ష్మి, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెత్సా అనిల్ కుమార్, బీజేపీ నాయకుడు పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు. మహిళలు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వైద్యాధికారిణి హైమశ్రీ వివరించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం సామూహిక సీమంతాలు చేశారు. వైద్యాధికారి అరుణకుమారి, సూపర్‌వైజర్ విజయభాను, తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారావం(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలంపాలెం గ్రామంలో శుక్రవారం స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని సర్పంచ్ టేకుమూడి సుజాత సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, మండల బీజేపీ సేవా పక్వాడ కన్వీనర్ హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, రాజేశ్వరి తది తరులు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మహిళా ఆరోగ్యరక్షణ కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తోందని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. స్త్రీ ఆరోగ్యంగా ఉంటే కుటుంబమంతా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.





వెలంపాలెంలో పోషకాహార ప్రదర్శన తిలకిస్తున్న దృశ్యం, ఉచ్చిలిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

మండపేట ఎంపీపీ వాసు టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే వేగుళ్ల నేతృత్వంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్ల శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీపీ వాసు

మండపేట, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండపేట మండల వైసీపీకి చెందిన ఎంపీపీ ఉండమట్ల వాసు తన అనుచరులతో కలిసి శుక్రవారం అమరావతిలో ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు సారథ్యంలో రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. వాసుతోపాటు ఇద్దరు ఎంపీటీసీలు, ముగ్గురు కేశవరం పంచాయతీ వార్డుసభ్యులు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కేశవరంనకు చెందిన ఎంపీటీసీలు చంద్రమళ్ల పోతురాజు, ద్వారపూడికి చెందిన ఎంపీటీసీ తీగిరెడ్డి దుర్గతోపాటు కేశవరం పంచాయతీ వార్డుసభ్యులు నలుగురు పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండపేట మండల టీడీపీ అధ్యక్షుడు కర్రి తాతారావు, కంటిపూడి శ్రీనువాసరావు, పోతురాజు దేవస్థానం చైర్మన్ ఆళ్లరాజు, తదితరులు పాల్గొన్నారు.

'రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించండి'



సత్యవాడలో సొసైటీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సీతారాముడు

కె.గంగవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వాటిని చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సత్యవాడ సొసైటీ అధ్యక్షుడు సలాది సీతారాముడు అన్నారు. సొసైటీ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రైతులు క్రాప్ రుణాలు మంజూరు చేయాలని కోరారు. డీసీసీబీ సూపర్‌వైజర్ చింతపల్లి గోవిందు మాట్లాడుతూ సొసైటీ లావాదేవీలు పూర్తిగా కంప్యూటరీకరణ చేశామని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతీ రైతు దీనిపై అవగాహన ఉండాలని సూచించారు. ఉప సర్పంచ్ సలాది వెంకన్న, స్వచ్ఛ ఆంధ్ర కార్పొ రేషన్ డైరెక్టర్ సలాది రమేష్, కూటమి నాయ కులు పామర్తి ఆనందరాయుడు, బండారు చినబాబు, వల్లభరెడ్డి సూర్యనారాయణ, తాడాల సూర్యభాస్కరరావు, అడపా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వేగాయమ్మపేట సొసైటీ సర్వసభ్య సమావేశం

వేగాయమ్మపేట సొసైటీ సర్వసభ్య సమావేశం శివలలోని సొసైటీ కార్యాలయంవద్ద శుక్రవారం జరిగింది. అధ్యక్షుడు మేకా జానకిరామయ్య అధ్యతన జరిగిన సమావేశంలో సొసైటీ లావాదేవీలను సొసైటీ సిబ్బంది గురించి సభ్యులకు వివరించారు. సకాలంలో రుణాలు చెల్లించి సొసై టీ అభివృద్ధికి సహకరించాలని అధ్యక్షుడు మేకా జానకిరామయ్య సభ్యులను కోరారు. ఇఫ్కో ప్రతినిధుల ద్వారా రైతులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు కాకి అప్పారావు, గుబ్బల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామివారి నిత్యఅన్నదాన ట్రస్టుకు తెలంగాణా రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన పసుపులేటి శరత్ చంద్రబాబు-సుజాత దంపతులు రూ.50,116, రాజమహేంద్రవరానికి చెందిన ఉండవల్లి మెహర్‌కార్తీక్ రూ.50,116 విరళాలు సమర్పించారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఈవో నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

పట్టణంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేస్తాం

● కమిషనర్ రంగారావు

మండపేట, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో త్వరలో ఫుడ్‌కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు మండపేట మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలో బస్టాండ్ సమీపంలో వున్న దోబిఘాట్ ప్రహరీగోడకు చేర్చిఫుడ్ కోర్టును ఏర్పాటుచేసే ప్రదేశంను కమిషనర్ పరిశీలించారు. త్వరలో పట్టణంలో ఫుడ్‌కోర్టు ఏర్పాటుచేస్తామని వెల్లడించారు.

'పంచాయతీలు సొంత వనరులు పెంచుకోవాలి'





కె.గంగవరంలో శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు, కపిలేశ్వరపురం శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భానూజీరావు

కె.గంగవరం, సెప్టెంబరు26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు సొంతంగా ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించుకుని ఆర్ధి కంగా బలోపేతం చేసుకోవాలని ఎంపీడీవో కార్యాలయం పరిపాల నాధికారి సురేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఓఎస్‌ఆర్ (ఓన్ సోర్స్ రెవెన్యూ) కార్యక్రమంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా దీనిపై శిక్షణ పొందిన కార్యదర్శి కె.వి.వి. సత్యనారాయణ పంచాయతీలు ఆదాయం పెంచుకునే మార్గాలను కొత్తగా పన్నులువేసే విధానం, పన్నులు వసూలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా చేపట్టడానికి అవకాశం ఉన్న నిర్మాణాలు వంటివి వివరించారు. మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వన్ రిసోర్స్ రెవెన్యూపై శిక్షణ

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వన్ రిసోర్స్ రెవెన్యూపై మండలంలోని గ్రామసర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో హెచ్.భానూజీరావు అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణలో గ్రామపంచాయతీ నిధులు సొంతంగా సమకూర్చుకునేందుకు ట్రైనర్ కె.రామకృష్ణ అవగాహన కల్పించారు. గ్రామంలో ప్రతీ ఇంటికీ పన్ను కలిగి ఉండాలని, షాపుల యజమానుల నుంచి లైసెన్స్ ఫీజులు సక్రమంగా వసూలు చేయాలని, సెల్‌టవర్స్ లైసెన్స్ ఫీజులు, ఇన్‌స్టాలేషన్ ఫీజులు వసూలు, గ్రామంలో ఇతర వనరులపై వచ్చే ఆదాయం పెంపొందించుకోవడం, తదితర అంశాలపై ఆయన శిక్షణలో వివరించారు. రెండురోజులపాటు ఈశిక్షణ జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఏవో జి.రాజేంద్రప్రసాద్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వెదురుపాకలో సూర్యఘర్ పథకం కరపత్రాలతో ఏఈ

రాయవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని వి ద్యుత్‌శాఖ ఏఈ ఎస్.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వెదురుపాక గ్రామంలో సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవడంద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పిలుపునిచ్చారు. సూర్యఘర్ యోజన పథకం కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి ఇంటివద్ద ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్‌టాప్‌ను ఏఈ పరిశీలించారు. లైన్‌మెన్ తాతరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కె.గంగవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ఎస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉపాధిహామీ పథకం ఏపీవోపై విచారణ

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఏపీవో జి.కవితపై వచ్చిన అభియోగంపై శుక్రవారం డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ అధికారి ఏవీ శ్రీనివాసరావు విచారణ నిర్వహించారు. గతంలో 2019 నుంచి 2022 వరకు కపిలేశ్వరపురం ఏపీవోగా పనిచేసినప్పుడు ఆమెపై 305 నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండానే ఏర్పాటు చేసినట్లు చూపి సొమ్ములు తీసుకున్నట్లు వచ్చిన అభియోగంపై విచారణ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్స్ నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు నివేదికను తాడేపల్లి పీఆర్‌అండ్‌ఆర్‌డీకి నివేదించనున్నట్లు విచారణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. విచారణలో డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ను విచారణ చేస్తున్న అంబుడ్స్‌మెన్ అధికారి శ్రీనివాసరావు

సచివాలయ ఉద్యోగుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

ద్రాక్షారామ, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని మున్సిపల్ వార్డు సచివాలయ ఉద్యోగులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ వారికి మద్దతు ప్రకటించారు. వారిని ఉద్దేశించి మాట్లాడారు. సెలవు రోజుల్లో ప్రభుత్వం డ్యూటీలు వేయు పద్ధతిని విడనాడాలని, వలంటీర్లు నిర్వహించే విధులను ఉన్నతచదువులు చదువుకున్న సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ మా వ్యక్తిత్వాన్ని కించపరిచే పద్ధతి మానుకోవాలని సచివాలయ ఉద్యోగులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని 12 సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.